# పెళ్ళి చేసుకోను

బి. విద్యాసాగర్

టెలిఫోను బెల మ్రోగింది. ఎవరయి వుంటారా, అని ఆశ్చర్యపోతూ రిసీవర్ తీసి విన్నాను. 'హల్లో! నేనూ రాజశేఖరం మాట్లాడుతున్నది—ఏమి లేదు! ఒకసారి వీలుచేసుకుని నువ్వు మా యింటికి రావాలి నాయనా!"

"ఏమిటి విశేషం?"

"నీతో కొద్దిగా మాట్లాడాలి—తప్పకుండా వస్తావు కదూ!"

"అలాగే! మీరు సాయంత్రం ఇంట్లోనే వుంటారుగా!"

"వుంటాను." అని ఫోను పెట్టేశాడు.

ఎందుకు పిలిచి వుంటాడా అని ఆశ్చర్యపోతూ, కుర్చీలో కూలబడ్డాను. కాసేపు ఎంత ఆలోచించినా ఆయనకు నాతో పనేమిటో అర్థం కాలేదు. సస్పెన్సు భరించలేకుండా వున్నాను. ఇంతలోనే మెరపులాగా వొకటి తట్టింది. వాళ్ళ ప్రబుద్ధుడు ఏదయినా అఘాయిత్యం చేసి వుంటాడు. అందుకే నాతో సంప్రతించటానికి పిలిచి వుంటాడు. అంతే! అంతకంటే రాచకార్యం యేమీ వుండదు.

ఆ వేళ సాయంత్రం అనుకున్న ప్రకారము, రాజశేఖరంగారింటికి వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి మా రాయుడు (సుబ్బారాయుడు) ఆముదం త్రాగిన ముఖం పెట్టి, కుర్చీలో కూర్చున్నాడు. తండ్రి ఇంట్లో లేడు.

"ఏరా, షేక్సిపియర్, ఏమొచ్చిందిరా - మీ నాన్న కబురుచేశాడు" అన్నాను.

"ఏమో! ఆయననే అడుగు" బుంగమూతి పెట్టి చిన్నపిల్లాడిలాగా అన్నాడు.

"ఆయనను ఎలాగో అడుగుతాను—ఈ లోపల నువ్వు చెప్పకూడదూ!" అని కొంత స్వరం తగ్గించి "మనలో మాట-మళ్ళీ ఎక్కడన్నా పప్పులో కాలేశావా" అన్నాను.

వాడు కొంత సీరియస్‌గా పోజు పెట్టి "ఏమి లేదురా! సంబంధాలేవో వస్తున్నాయ్! పెళ్ళిచేసుకోమని నన్ను వేధిస్తున్నారు. నాకిష్టం లేదంటే ఊరుకోరు."

"ఏమి! ఎందుకిష్టం లేదు?"

"నాకసలు పెళ్ళి చేసుకోవాలనే లేదు."

"హరి పిడుగా! ఎందుకంత విరక్తి?".

"నాకు ఆడవాళ్ళంటేనే నమ్మకం పోయింది—వాళ్లను నమ్మినంత తెలివితక్కువ ఏదీ వుండదు—గంగలో దించేసి చప్పట్లు కొడతారు—నా జీవితంలో యింకే స్త్రీని నమ్మను—నమ్మబోను! మానవుడు ఎవరినైనా వొక్కసారే ప్రేమిస్తాడు. ఆ ప్రేమ విఫలమయితే...

"ఆత్మహత్య చేసుకుంటాడు. అంతేనా! నీకుకూడా అలాంటి ఆలోచన వుంటే చెప్పు! మార్గం ఆలోచిద్దాము" అన్నాను నవ్వుతూ.

"చాలులేరా! నీదంతా వేళాకోళం."

"వేళాకోళం కాదు! ఆత్మహత్య చేసుకోవాలంటే, వొక్కసారే చేసుకో! ఎక్కువసార్లు ప్రయత్నిస్తే నీ ఆరోగ్యం చెడుతుంది!"

"ఈ కబుర్లకేమి కానీ, నాకేమీ తోచకుండా వుందిరా!"

"అలా పార్కుకు వెళ్దాము రా! మళ్ళీవచ్చి మీ నాన్నను కలుసుకుంటాను."

సుబ్బరాయుడు, ముస్తాబుకు అట్టహాసం చేస్తుంటే, నాకు నవ్వువచ్చింది. "ఓరే, బాబూ! ఇప్పుడు నీ మేకప్ మొదలుపెడితే వొక గంట పడుతుంది కానీ, యిలాగే వచ్చెయ్యి" అన్నాను.

"ఎందుకురా, రెండు నిమిషాలు" అంటూ వొక అరగంటసేపు కానిచ్చాడు. బాత్‌రూమ్‌లో రెండు సబ్బులు అరగకొట్టి బయటకు వచ్చి, అద్దంముందు తీరికగా కూర్చుని పౌడరు పూసుకుంటున్నాడు.

"ఎలాగుంది" అని ఠీవిగా నా వంక చూశాడు.

"పగటివేషగాడిలాగా వున్నావు—త్వరగా కానియ్యి" అని తొందరచేశాను. అప్పటికీ, మరో అయిదు నిముషాలు ఆలస్యం చేసి, బాగా రూపాయిమందాన పౌడరు పూసుకుని, నల్లద్దాల కళ్ళజోడు పెట్టుకుని, 'రాజు వెడలె' అన్నట్లు బయలుదేరాడు.

పార్కుకు చేరుకున్నాము. ఒక మూలనున్న బెంచీమీద యిద్దరమూ కూర్చున్నాము.

"ఏరా! మీనాన్న ఎక్కడికి వెళ్ళారురా—నేను వచ్చేటప్పటికి లేరు" అన్నాను.

"ఏదో పనివుండి బజారుకు వెళ్ళాడు. ఈ పాటికి తిరిగి వచ్చి వుంటారు"

"సరే కానీ, నువ్వు యింకా లీలను జ్ఞాపకం పెట్టుకున్నావన్నమాట" అన్నాను వొక నిముషం ఆగి.

అవునన్నట్లు తలవూపాడు. నాకు వెంటనే ఎన్నో సంగతులు జ్ఞాపకం వచ్చినాయి.

* * *

అవి మేము కాలేజీలో చదువుకునే రోజులు. మేమిద్దరమూ బి. యస్. సి. లో క్లాసుమేట్సు, మాతో చిదంబరం ఎప్పుడూ తిరుగుతూ వుండేవాడు. వాడు సుబ్బరాయుడిని ఎప్పుడూ వేళాకోళంచేసి ఏడిపించేవాడు. వాళ్ళిద్దరూ చిన్నప్పటినుంచీ క్లాసుమేట్సు. అందుకని నాదగ్గరకంటే చిదంబరానికి సుబ్బారాయుడు అంటే ఎక్కువ స్వతంత్రం. ఇద్దరూ వొకేసారి, ఇంటర్మీడియట్, 'డాం' అని తప్పి, రెండు పల్టీలు కొట్టి, మళ్ళీ కాలేజీలో వచ్చిచేరారు. అజ్ఞాతవాసానంతరం, ముఖ్యంగా సుబ్బారాయుడు కాలేజీ జీవితం అంటే మొహం వాచివున్నాడు. దానితో మళ్ళీ వొక 'రోమియో' అవతారం ఎత్తి, కనపడ్డ అందమైన అమ్మాయివల్లా, నల్లద్దాల కళ్ళజోడుతో చూడటం మొదలుపెట్టాడు. మొదట్లో, ఈ విషయం ఎవరూ పట్టించుకోకపోయినా, రానురాను యిదొక వ్యాధిగా పరిణమించి, పురజనులకోరికపై వాడిచేత ఈ అలవాటు మాన్పించవలసివచ్చింది. అయినా వాడు మానుకోలేదు.

ఇది యిలావుండగా, వొక సుముహూర్తాన, సుబ్బారాయుడు వొక చిన్న మజ్నూ అయి కూర్చున్నాడు. మాకు ఎవరికీ తెలియనే తెలియదు. మా చదువుల గొడవలో మేము వున్నాము. ఒకరోజు మధ్యాహ్నం క్లాసు జరుగుతూవుండగా, నా పక్కనున్న చిదంబరంతో రహస్యంగా అంటున్నాడు. "ఆ వాయల్ చీర కట్టుకున్న అమ్మాయిని చూడు. గుర్తుంచుకో! తర్వాత చెపుతాలే" అన్నాడు కొంత మెల్లగానే. నాకు వినపడుతునే వున్నాయి ఈ మాటలు. నాకేమిటి! వెనుక బెంచీలలో వున్న మరిముగ్గురు వినే వుంటారు. ఎంత మెల్లిగా మాట్లాడినా

# పెళ్ళి చేసుకోను ★

రాయుడికిగొంతు మైక్‌లో చెప్పినట్లే వుంటుంది. ఒకళ్ళిద్దరు, వెనుక బెంచీల వాళ్ళు ఇది విని తమలో నవ్వుకుంటున్నారు. 'సైలెన్స్' అంటూ లెక్చరర్, పాఠం కొనసాగించాడు.

క్లాసు వదిలిపెట్టారు. అంతా బయటికి వచ్చాము. నేనూ, చిదంబరం పోతూవుంటే, మాతోపాటు సుబ్బారాయుడు కూడా బయటికి వచ్చాడు. తర్వాత క్లాసు లేకపోవటం వలన, ఈలోపల, చిదంబరం రూముకి వెళ్ళి రావచ్చు ననుకుని, అక్కడకు వెళ్ళాము.

తాళం తీసి, లోపలకు వెళ్ళాము. రాయుడు, తన ప్రయోజకత్వం బయటపెట్టటానికి, తొందరపడుతున్నాడు.

"ఇందాక చూపించానే! మన క్లాసు మేట్ - ఆమెను లవ్ చేశానురా" అన్నాడు ఎంతో ముద్దుగా.

మాకు పిడుగుపడ్డట్లయింది. సుబ్బారాయుడికి యిదేమి క్రొత్తికాదు. హైస్కూలులో వుండగా, మనస్సులో ఎన్నో బొమ్మల్ని మార్చాడు. కొంతమందితో బహిరంగంగా ప్రణయకలాపం సాగింది. వొకసారి దేహశుద్ధికూడా చేయించుకున్నాడు. అయినా వాడికి ఆ పిచ్చి వదలలేదు. అప్పటినుంచీ, ఎవరినో వొకరిని ప్రేమిస్తూనేవున్నాడు. ప్రేమ అనేది వాడి భాషలో చాలా సామాన్యమయిన విషయం. దానికి హృదయమనేది అవుసరం లేదు. రోజు కొకర్ని ప్రేమించి, మర్నాడే మర్చిపోతూవుంటాడు. అందువల్ల, రాయుడు మళ్ళీ ఎవర్నో ప్రేమించాడంటే పెద్ద విశేష మేమీ కాదు. అయినా అజ్ఞాతవాసంలో, వాడు నడిపిన గ్రంథం యేమీ లేకపోవడం మూలాన, యిది మళ్ళీ వొక హైడ్రోజను బాంబులా వుంది. చిదంబరం యిది విని.

"చంపేశావు! మళ్ళీ మొదలుపెట్టావేమిటి భాగోతం! ఈ అమ్మాయి నీ జాబితాలో ఎన్నో దేమిటి!'

"ఎన్నోదయితే, నీకెందుకు - ఈసారి నేను మనస్ఫూర్తిగానే ఆమెను ప్రేమిస్తున్నాను" అన్నాడు కొస్త సీరియస్‌గా.

అయితే పెద్ద ప్రమాదమే ముంచుకొచ్చిందని, నేనూ, చిదంబరం భయపడ్డాము. సుబ్బారాయుడి ప్రేమకలాపమంటే, వూళ్ళో చాలామందికి తెలిసేవుంటుంది. ఎందుచేతనంటే, రెండేళ్ళ క్రితం, వాడు యిదే కాలేజీలో చదువుతూవుండగా, వొక మోహనాంగిని ప్రేమించి - లేదు, పిచ్చిప్రేమలో పడి - చివరికి పురజనుల విన్నపంపై ప్రిన్సిపాలుచేత నాలుగు అక్షింతలూ వేయించుకున్నాడు. ప్రిన్సిపాలు మాత్రం వూరుకున్నాడా! సస్పెండు చేస్తానని బెదిరించాడు. దానితో రాజశేఖరంగారికి గుండెల్లో రైళ్ళు పరుగెత్తి, చివరికి, కుమారరత్నం తరఫున, ప్రిన్సిపాలుగారికి క్షమాపణ చెప్పుకొని వాడిని ఆపదలోనుంచి గట్టెక్కించాడు. అది రాయుడు అప్పుడే మర్చిపోయాడు. మర్నాడే, మనస్సులో బొమ్మ మార్చి, యింకో లతాంగిని ప్రేమించాడు. అప్పట్లో రాజశేఖరంగారికి రాత్రిళ్ళు నిద్రపట్టేదికాదు. ఏరాత్రయినా, చెప్పాపెట్టకుండా, వొక సుందరాంగితో రైలు ఎక్కేస్తాడని భయపడేవాడు. కానీ అలా జరుగలేదు. కారణం, సుబ్బారాయుడి లిస్టులో చాలామంది వున్నారు. అందరినీ వొకేసారి, లేకపోతే వేరు వేరుగా ప్రేమిస్తూ మా వూళ్ళోనే వున్నాడు. పరీక్షలు దగ్గరకు వస్తుంటే, తాత్కాలికంగా చదువుమీదకు దృష్టి పోనిచ్చాడు. ఇది రాజశేఖరంగారి కళ్ళనీళ్ళు తుడవటానికి చేసే తతంగం! రాత్రిళ్ళు పన్నెండింటిదాకా, గదిలో దీపం వెలిగించి, ధూమపానం చేసి, పరీక్షకు సిద్ధమయాడు. కానీ చదివితేగా! క్రికెటులో మూడు 'స్టంప్స్' పడిపోయినట్లు, సుబ్బారాయుడికి ఆ యేడు మూడు పార్టులూ గోవింద కొట్టినాయి. ఇది లాభంలేదని, మూడు భాగాలనూ, వేరు వేరుగా చేసి, వొక్కొక్కటే నెమ్మదిగా ప్యాసయినాడు. ఇదీ టూకీగా వాడి వృత్తాంతం!

ఈరోజు సుబ్బారాయుడు క్రొత్తగా మళ్ళీ వొకరిని, ప్రేమిస్తున్నాడంటే, అంత పెద్ద విషయమేమీ కాదు.

"ఏరా, బాబూ! ఆ అమ్మాయికి, నువ్వు ప్రేమిస్తున్నావని తెలుసా?" అని అడిగాడు చిదంబరం. నిజమే! ఇది అడుగవలసిన ప్రశ్నే! ఎందువల్లనంటే, రాయుడి ప్రేమ చాలావరకు నిగూఢప్రేమ.

"ఆ, అమ్మాయితో యింకా మాట్లాడలేదురా!"

"అయితే, ఆమెకు ఈ సంగతి తెలియదన్నమాట!"

"వుహుఁ!" అని అడ్డంగా తలకాయి త్రిప్పి "ఆమెతో మాట్లాడాలంటే, వీలు కాకుండా వుందిరా. ఏమీ తోచకుండా వుంది—పోని వొకపని చెయ్యమంటావు?" అన్నాడు.

"ఏమిటది?" అన్నాడు చిదంబరం.

"ఏమిలేదు—వీలు చూసుకొని, వొకసారి వాళ్ళయింటికి వెళ్ళవద్దా మనుకుంటున్నాను."

"అంత పనిమాత్రం చేయబోకు. వాళ్ళ నాన్న చూస్తే 'ఎవడీ అంట వెధవ!' అని కర్ర పుచ్చుకుంటాడు."

"మరి, యేమి చేయమంటావురా?"

"ఏమివద్దు—ముందు నువ్వీ పిచ్చివేషాలు మానెయ్యి" అన్నాను.

"అది నా జన్మలో చేతకాదు—నా హృదయం ఆమెకు అర్పించాను" అన్నాడు కవిత్వం వొలకపోస్తూ.

"ఏడిచావు! ఈ కబుర్ల కేమి?"

"కబుర్లుకాదు నిజంగానేరా!— ఆమె లేనిది నేను జీవించలేనురా!" అన్నాడు సినిమాలలో మాదిరి (ఇది సినిమాలు చూసి నేర్చుకున్నమాట).




“అయితే పిచ్చి బాగానే ముదిరింది” అన్నాడు చిదంబరం.

“అబ్బ! వూరుకోండిరా—మీరూ, మీ వేళాకోళమూను—ఈ సమస్యను ఎలా ‘సాల్వ్’ చేయాలో తెలియకుండా వుంది.”

“అయితే, నేనొక వుపాయం చెపుతా వుండు” అన్నాడు. చిదంబరం మళ్ళీ.

“ఏమి టది?”

“రేపు కాలేజీ ఎన్నికలలో పోటీచెయ్యి. నీ అదృష్టం బాగుంటే స్టూడెంట్సుయూనియన్ ప్రెసిడెంట్ అవుతావు—అప్పుడీ లీల యేమిటి; ఎవరయినా నిన్ను ప్రేమిస్తారు.”

ఈ సలహా బాగానేవుంది— మా మిత్ర బృందంలో వున్న మిగతా సభ్యులు కూడా యిది చర్చకుపెట్టి, సూచన అంగీకరించినట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు.

నాలుగురోజులు గడిచాయి. సుబ్బారాయుడు ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ పడేశాడు. మర్నాడు కరపత్రాలు అచ్చు వేయించాము. దానితో అతనిపేరు కాలేజీలో మారుమ్రోగింది. డి. సుబ్బారాయుడు అంటే అందరికీ తెలిసిపోయింది. ఎవరి చేతిలో చూచినా రాయుడు పేరుగల కరపత్రాలే! అవి చూచుకుని సుబ్బారాయుడు వుక్కిరిబిక్కిరి అయ్యాడు. ఎన్నికలలో గెలిచినంత సంతోషపడ్డాడు. రేపు గెలిచినా, వోడినా, ముందు తనపేరు అందరికీ తెలిసిపోయింది—నిజానికి, నాలుగు రూపాయిలుఖర్చుచేసి కరపత్రాలు వేయిస్తే, మరో డబ్బారేకుల సన్యాసిపేరయినా అందరికీ తెలుస్తుంది. ఇందులో విశేష మేమీ లేదు. కాని, మా రాయుడు అలా అనుకోవటంలేదు. తనలో ఏదో ప్రత్యేకత వుంది. అందుకే మేమంతా బ్రహ్మరథం పడుతున్నామనుకుంటాడు.

పెద్ద ఎన్నికలకు చేసినంత తతంగం జరిపించాము. వాల్ పోస్టర్లు అంటించాము. మైక్ లో రాయుడిపేరు చెప్పాము. చివరికి సుబ్బారాయుడిని రోడ్డుకు అడ్డంగా వ్రేల్లాడంటాడు—కాదు, కాదు—అతనిపేరు వ్రాసిన తడికలను కట్టాము. అంతే!

“ఎలాగుందోయ్! మన ప్రచారం” అన్నాడు వొకరోజు తాపీగా సిగిరెట్ వెలిగిస్తూ.

“ప్రచారానికేమి! బాగానే వుంది— మనం గెలుస్తామో, లేదో అనుమానంగాని.” అన్నా డొక సన్యాసి.

సుబ్బారాయుడి ముఖం చిన్నబోయింది. పదివేలు తగలేసిన ఎమ్. ఎల్. ఏ. లాగా ముఖం పెట్టాడు. ఇది కనిపెటి.

“నీకేమి భయంలేదు. ధైర్యంగా వుండు- ఎందుకు గెలవ్వోమూస్తాము” అన్నాడు చిదంబరం ధైర్యం చెప్తూ.

“ఏమోరా! నా కెందుకో గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయ్” అన్నాడు రాయుడు బిక్కమొహం వేసి.

“భయమెందుకురా! గెలిచినా, వోడినా, నీవు కీర్తిశేషుడి వవుతావు” అన్నాను సీరియస్ గానే.

రాయుడు ఇది వినిపించుకోకుండా, ఎటో చూస్తూ, “అవును. నిజమే” అన్నాడు. నిజానికి, చాలారోజులవరకూ, ‘కీర్తిశేషులు’ అనే మాటకు సుబ్బారాయుడికి అర్థం తెలియదు. తెలుగులో వాడిదంతా సహారా ఎడారి. అయితే యిప్పుడు కాస్తనయం. భాషనంత ఖూనీచేయటం లేదు.

ఎన్నికలరోజు వచ్చింది. మా’కందరికీ చేతినిండాపని. చిదంబరం. లౌడ్ స్పీకర్లలో, కాలేజీ బయటనుంచి రాయుడిపేరు గట్టిగా చెప్పాడు. ఇదే లౌడ్ స్పీకర్లు, కాలేజీలోపల పెడితే. ఈ పాటికి ఎన్నికలు ‘రప్’ మని ఆగిపోయేవి. ఇంతా మైక్ లో చెపుతుంటే, సుబ్బారాయుడికి మధ్యలో ‘ఆమె’ విన్నదో, లేదోనని అనుమానంవచ్చింది.

ఆవేళ ఎన్నికలు అయిపోయాయి. చాలా కొద్ది మెజారిటీతో మా సుబ్బారాయుడు గెలిచాడు. ఆ వుషారులో, మా సేనలోని లంబోదర, కృశోదర, మహోదరు లందరికీ, ఆవ్వేళ హోటలులో కడుపునింపాడు.

ఇంత జరిగినా మాకు వుత్సాహంగాలేదు. కారణం, రాయుడి నిజస్వరూపం మాకు తెలుసు. అవసరంకొద్దీ, బెలూన్లో గాలి కొట్టినట్లు వాడినొక మనిషిగా తయారుచేసి తెరమీది కెక్కించాము. ఎప్పుడైనా అసలు రంగు బయటపడితే, మాపని అభాసు అవుతుంది. అందుకే రాయుడిని జాగ్రత్తగా కాపాడుకొస్తున్నాము. ఏమయినా స్వప్రయోజకత్వం లేని మనిషితో ఎన్నాళ్ళని వేగుతాము? అదే మాకు పట్టుకున్న దిగులు.

ఇక కాలేజీ యూనియన్, ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చెయటం మొదలుపెట్టాము. రంగురంగుల కాగితాలతో, మా కాలేజీని అలంకరించాము. ఒక ప్రముఖవ్యక్తిని ఆరోజు మాట్లాడటానికి ఆహ్వానించాము. ఆహ్వానం మా చిదంబరం వ్రాసిపెడితే, వేలిముద్ర వేసినట్లు, వొకసంతకరం తగలేశాడు.

ఆ రోజు మా కాలేజి కళకళలాడు తున్నది. పచ్చని తోరణాలు, భవనానికి వొక వింత శోభ చేకూర్చినాయి. మలయ మారుతం వీయటం లేదుగాని, ఈదురు గాలి, అప్పుడే కొద్దిగా మొదలుపెట్టింది. మా సుబ్బారాయుడు. వొక ఎరుపు బుష్కోట్ తొడుక్కుని, చక్కగా దసరా బుల్లిబాడి లాగా తయారయ్యాడు.

సభ ప్రారంభమయింది. ప్రిన్సిపాలు గారు స్వాగతోపన్యాసం యిస్తున్నారు.

ఇక్కడ మా రాయుడి కాళ్ళు కొంచెం వణుకుతున్నాయి. భయమేసి, తెరవెనుక్కు వచ్చాడు. మేము ధైర్యంచెప్పి ఎలాగో మళ్ళీ పంపించాము. ప్రిన్సిపాలుగారు మాట్లాడటం అయిపోయింది. మా రాయుడు వొక చిన్న పోజిచ్చి, అప్పటికి వందసార్లు రిహార్సలు చేసిన చిన్న ఉపన్యాసాన్ని జాగ్రత్తగా అప్పజెప్పేశాడు. తరువాత సభ సక్రమంగా జరిగిపోయింది. మధ్యలో కొద్దిగా వర్షం కురిసినా, పెద ఇబ్బందేమీ జరుగలేదు.

మర్నాడు సుబ్బారాయుడు విజయభేరి మ్రోగించాడు. మరింత వుత్సాహంతో కాలేజీలో తిరుగుతున్నాడు. అయితే చదువు మాత్రం సాగటంలేదు. అందు కతను దిగులు పడటంలేదు.

కాలేజీ పరీక్ష లయినాయి. దసరాకి సెలవు లిచ్చారు. సుబ్బారాయుడు వుషారుగా వాళ్ల వూరు వెళ్ళాడు. మాకు మాత్రం అంత వుత్సాహంగాలేదు.

మళ్ళీ కాలేజీ తెరిచిన, వారం రోజుల లోగానే, దిద్దిన పరీక్ష పేపర్లలో మొదటిది మా చేతికి వచ్చింది. అది చూసి, రాయుడు గరా హాజర్ వేద్దామనుకున్నాడు కాని, బాగుండదని వూరుకున్నాడు. మామూలుగా వెళ్ళి తనపేపరు తెచ్చుకున్నాడు, లెక్చరర్ చిన్నగా నవ్వుతూ పేపరు చేతికిచ్చాడు. సుబ్బారాయుడు వలయాకారం చూసి ఆశ్చర్యపడలేదు. ముందుగా అనుకున్నదేగా! అయితే ‘గ్యాస్’ అనే రిమార్కు మాత్రం కొద్దిగా బాధకలిగించింది

మర్నాటినుంచీ, సుబ్బారాయుడికి మంచి మార్కులు వస్తున్నాయి. కారణం ఎవరికీ అర్థంకాలేదు. కొందరు తెలివిగలవాడను కున్నారు. కాని, అసలు సంగతి ఎవరికీ తెలియదు. మొదటి పేపరు మినహా అన్నింటిలోనూ, కాపీకొట్టాడట! ఈ విషయం మాకు తర్వాత తెలిసింది. ఇది ఇలా వుండగా, కాలేజి మేగజైనులో సుబ్బారాయుడు “వ్రాసిన” కథ వొకటి పడింది. దీనికోసం శ్రమపడినవారు మా బృందంలో సేవున్నారు. ఏమయినా రాయుడిపేరు కాలేజీలో మ్రోగిపోతున్నది.

ఈ మధ్యకాలంలో. సుబ్బారాయుడి


అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)

# ★ పెళ్ళి చేసుకోను ★

తో, లీల వొకటి రెండుసార్లు మాట్లాడింది. అవి యిప్పటికీ అతనికి జ్ఞాపకం వున్నాయి. ఆమెచనువు ఆధారంగా చేసుకుని, రాయుడు నాలుగైదుసార్లు ఆమెయింటికి వెళ్ళాడు. తీరా ప్రేమించానని తెలియచేయటానికి ధైర్యం చాలలేదు. ఒకవేళ రాయుడు చెపుదామనుకున్నా, మొహానికి చెమటలుపోసి, కాళ్ళు వణికిపోతున్నాయి.

ఇక లాభం లేదని, బాగా రిహార్సల్సు వేసుకుని, వొకరోజు ధైర్యంచేసి, ఆమెని విషయం అడిగేశాడు. ఈ మాటలు సున్నితంగా లేకుండా, చాలా మొరటుగా వున్నాయి. మాతో సంప్రతించకుండా ఈ వుపన్యాసం స్వయంగా తయారు చేశాడు. అంతే! ఆమెకు కోపంవచ్చి, కస్సుమని, నాలుగు మాటలూ అనేసింది.

"మీతో చనువుగా వుండటం చూసి, మీ రిలా అపార్థం చేసుకుంటారనుకోలేదు. మీ రింకా చదువుకున్నవారనీ, ఉన్నత భావాలు కలవారనీ అనుకున్నాను కానీ, యింత సంస్కారవిహీను లనుకోలేదు" అంది కోపంతోనే.

ఇంకేముంది! మా వాడు ముఖం అణా బిళ్ళంత చేసుకుని, రూముకి తిరిగి వచ్చాడు. ఆరోజు రాత్రి భోజనం చేయలేదు. నాలుగు రోజులు ఉపవాసం చేస్తానన్నాడు. కాని లైమ్‌జ్యూస్ త్రాగి వుందామనుకున్నాడు. కాని ఈ లోపల 'గుటుక్కు' మంటానని భయంవేసి వూరుకున్నాడు.

ఆనాటినుంచి, సుబ్బారాయుడికి స్త్రీలంటేనే వొక విధమైన అసహ్యం వేసింది. అందుకే పెళ్ళిచేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు.

తర్వాత మేమంతా యమ్. ఎస్. సి. లో చేరాము. సుబ్బారాయుడు కూడా మాతో పాటు చేరాడు. యం. ఎస్. సి. అయినాక నేను ఉద్యోగంలో చేరాను. సుబ్బారాయుడు మాత్రం, ఖాళీగావున్నాడు. అయినా లీలమాత్రం అతని స్మృతి పథంలో యింకా అలాగేవుంది. ఆమెను మరచిపోలేదు.

* * *

పార్కులో సంగీతం వినపడుతోంది. నేనూ, రాయుడూ, పరధ్యానంగా సంగీతం వింటూ కూర్చున్నాము. ఇంతలోనే సంగీతం ఆగిపోయి "ఆలిండియారేడియో! వార్తలు..." అని వినిపించింది. నేను రిష్టువాచీవంక చూసుకున్నాను. సరిగ్గా ఏడయింది.

"ఏరా! మనం వెళ్దామేమిటి ?" అన్నాను.

"అలాగే" అంటూ లేచి నుంచున్నాడు. ఇద్దరమూ గేటుదాటి బయటికి వచ్చాము. బయట జన సంచారం అంతగా లేదు.

"ఏరా! పెళ్లిచేసుకోవటానికి, నీ అభ్యంతరం యేమిటి ?" అన్నాను.

"ఆ విషయమే అడుగకద్దు! నాకు ఇష్టం లేదు. అంతే!"

"అదే, యెందు కిష్టం లేదని అడుగుతున్నాను"

"నీకు తెలియనట్లు అడుగుతా వేమిటి! నేను లీలను ప్రేమించాను. ఆమెను తప్పితే, యింకొకర్ని పెళ్ళి చేసుకోదల్చుకోలేదు"

"బాగుందిరా !...... యింకా అదే పట్టుకు కూర్చుంటా వేమిటి ?".

"నాకు తెలియదు, వూరుకో"

"ఏమిటిరా! నాకు తెలియనిది—నీకేమయినా పిచ్చిపట్టిందా—ఆమె కీపాటికి పెళ్ళయిపోయి వుంటుంది."

"అయితే, అయింది. నేను మాత్రం పెళ్లి చేసుకోను"

"బాగుంది! ఆమెకోసం బ్రహ్మచారిగానే వుంటావా"

"ఆ, వుంటాను—నీ కెందుకు"

"నాయనా, నీకు బాగా పిచ్చెక్కిందిరా! —ఎవరు చెప్పినా వినవు—యిలా అయితే నిన్ను పిచ్చాసుపత్రిలో చేర్పించాల్సి వస్తుంది" అన్నాను నవ్వుతూ.

"ఆ, చేర్పించండి—వచ్చిన యిబ్బందేమీ లేదు"

ఇంతలోనే యిల్లు చేరుకున్నాము. రాజశేఖరంగారు అప్పటికి బజారునుంచి తిరిగి వచ్చి, తీరిగ్గా రేడియో పెట్టుకు కూర్చున్నారు. తలుపు చప్పుడు విని, రేడియో కట్టేసి, వచ్చి తలుపు తీశారు. నన్ను చూసి ఆప్యాయంగా.

"రావోయ్—నీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నారు.

"ఇప్పుడే ఇంతకుముందు వచ్చాను—మీరు లేరు—అందుకని, మే మిద్దరమూ అలా పార్కుకు వెళ్ళాము."

"నేనూ, అదే అనుకున్నానులే!—సరే కాని, నీకు విషయం మావాడు చెప్పాడనుకుంటాను."

"ఆ, చెప్పాడు" అని తల వూగించి, "ఏమిటో! నాకూ ఏమీ తోచటం లేదండీ" అన్నాను.

ఆదేనోయ్-వీడితో పెద్దచిక్కు వచ్చింది. —అవతల చూడ పోతే చాలా సంబంధాలు వస్తున్నాయి"

"ఎందుకు రావూ—యం. ఎస్. సి. ప్యాసయినాడయ్యె!"

"పెళ్ళెందుకు చేసుకోవంటే కారణం చెప్పడు. మౌనంగా వూరుకుంటాడు. వీడితో ఎలా వేగటమో నాకు తెలియకుండావుంది"

"పోనీ, మీ నాన్న యిష్ట ప్రకారం, చేసుకో గూడదుటురా," అన్నాను రాయుడి వంకకు తిరిగి.

"మళ్ళీ అదేమాట! నాకు పెళ్లే వద్దంటుంటే, యింకా నన్ను వేధించుకు తింటా రేమిటి?"

"ఎవర్రా. నిన్ను వేధించుకు తింటున్నది' అన్నాడు ముసలాయన కస్సుమంటూ.

"మీరు వూరుకోండి, బాబూగారూ!... యింతకీ సంబంధాలు ఏక్కడనుంచి వచ్చాయి" అన్నాను.

"చెప్పేమి ప్రయోజనం - వాడికిష్టం లేనప్పుడు"

"అయినా చెప్పండి వింటాము."

"పెద్దపులివర్రునుంచి వొక సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి బి. యస్. సి, ప్యాసయిందట.' అన్నారు తాపీగా.

"పేరేమిటి?" అన్నాను.

"లీలాకుమారిట."

"అయితే, చేసుకుంటాను నాన్నా!" అన్నాడు సుబ్బారాయుడు ఎగిరి గంతేస్తూ. రాజశేఖరంగారికి అర్థంకాక విస్తుపోయాడు. అరంచేసుకున్న నేనునాలోనవ్వుకున్నాను ★




* ఇనుప పెట్టెలు * బీరువాలు

* క్యాషుబాక్సులు * ఆఫీసురాక్సు

ముప్పది సంవత్సరములుగా నాణ్యమునకు, మన్నికకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందినవి.

అల్లారాం అండ్ కో

(స్థాపితము : 1928.)

(H. O.) వెలగలేటివారి వీధి, విజయవాడ - 1.

(బ్రాంచి) 2/156, బ్రాడ్వే, మద్రాసు - 1.

క్రొత్త షో రూమ్ మారుతీ సినిమా కెదురుగా.

NVKR, VJA